క్లుప్తంగా

గజ్జలమ్మ దేవికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ చేశారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తలనీలాలు, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

హిందూ సంఘాల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నర్సాపూర్ (జి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలని ధర్నా చేస్తున్న వారిపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ ఆదివారం నర్సాపూర్(జి)లో హిందూ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు బర్కుంట నరేందర్, దూసముడి నవీన్, పల్లపు రాజు, సాయికృష్ణ, గంగారాం, రాజు, అశోక్, పర్స మహేశ్, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

భీమన్నదేవుని ఉత్సవాలు ప్రారంభం


జోగు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో భీమన్న దేవుని ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులు భీమన్న దేవుని గజాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఇంటింటా జోగు కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం గంగనీళ్ల స్నానం, శుక్రవారం జాతర ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నిందితుడిని శిక్షించాలి

భైంసాటౌన్: హిందూ ఆలయాలపై దాడులు, దొంగతనాలను అరికట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. పట్టణంలోని నర్సింహస్వామి ఆలయంలో చోరీ చేసిన నిందితుడిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం


సాయం అందిస్తున్న ఆర్‌ఎంపీలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ మల్లేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ యూనియన్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారికి రూ.10వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఇందులో ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం మండలాధ్యక్షుడు రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు నాగులరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు


హారతి తీసుకుంటున్న విఠల్‌రెడ్డి, నేతలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో స్వయంభుగా వెలిసిన దుర్గమ్మను ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం తరఫున ప్లాట్‌ఫాం కోసం రూ.లక్ష, హనుమాన్ విగ్రహం వద్ద ప్రహరీ నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేసిన ప్రొసీడింగ్ పత్రాలను ఆలయ కమిటీ, గ్రామస్తులకు అందజేశారు. నిధుల మంజూరుకు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, విఠల్ రెడ్డిలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంకుమార్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి, రాజు, దత్తుపటేల్, సాయికుమార్, మహేశ్, భోజారాం తదితరులు ఉన్నారు.

అడుగడుగునా నిఘా

- గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు
- నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న వైనం


కల్లూరు జాతీయ రహదారిపై కెమెరాలు


కల్లూరులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై భాస్కరాచారి

కుంటాల: గ్రామాల్లో నేరాలు, దొంగతనాలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ దాతల సాయంతో ప్రధాన కూడళ్లు, బస్టాండ్, అనుమానిత ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్నారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ఎప్పటికప్పుడు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు..

ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని ఉన్నతాధికారులు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. నేరాల ఛేదనలో సీసీకెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కెమెరాల ప్రయోజనాలను తెలుసుకున్న గ్రామస్తులు.. కెమెరాల ఏర్పాటు చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యాపారులు సైతం తమ వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మరోవైపు సైబర్‌నేరాలపై పోలీస్ సిబ్బంది గ్రామాల వారీగా అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని.. అపరిచితులు కన్పిస్తే 100కు డయల్ చేయాలని గ్రామస్తులకు వివరిస్తున్నారు.

గ్రామాల వారీగా..

కుంటాల మండలంలో 15 గ్రామపంచాయతీ లున్నాయి. దాతల సాయంతో కల్లూరులో-14, ఓలాలో-9, లింబా(కే)-8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని ఆదర్శంగా నిలిచారు. పెంచికల్‌పాడ్‌లో-4, విఠాపూర్‌లో-4, సూర్యాపూర్‌లో-4, అంబకంటిలో-3, అంబకంటితండాలో-2, అంబుగామలో-2, దౌలెల్లిలో-4, అందాకూర్‌లో-4, లింబా(బి)లో-4, లింబాద్రిలో-5, నెదల్‌పూర్‌లో-5, వెంకూరులో- 2 కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిలో పనిచేయని వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు వీడీసీ సభ్యులు పేర్కొన్నారు.

అందరి సహకారంతోనే..

సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను గ్రామాల్లో ప్రజలకు వివరిస్తున్నాం. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. దాతలు, గ్రామస్తులు సైతం ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అందరి సహకారంతో ముందుకు సాగుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడబోం. అనుమానితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలి.

– సీహెచ్.భాస్కరాచారి, ఎస్సై

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాల రైతువేదికలో 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఏడుగురికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. చెరువులకు మరమ్మతులు చేయిస్తానన్నారు. అనంతరం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో సన్నరకం, దొడ్డురకం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్‌ఖాన్, డీటీ నరేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారం, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, నాయకులు వెంగల్‌రావు, రమణారావు, అశోక్‌కుమార్, జక్కుల గజేందర్, సుధాకర్, డైరెక్టర్ ప్రణయ్‌రావు, సీఈఓ నాగభూషణం, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు


నీటి సమస్య పరిష్కరిస్తున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్: పట్టణ పరిధిలోని ప్రజలకు నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో నిరుపయోగంగా మారిన తాగునీటి చేతిపంపునకు ఆదివారం మరమ్మతులు చేయించారు. అంతకుముందు డబుల్ బెడ్‌రూం కాలనీలోని సీ4, సీ5, సీ6, సీ7 బ్లాక్‌లకు తాగునీరు రావడం లేదని కాలనీవాసులు చైర్మన్‌కు విన్నవించారు. స్పందించిన చైర్మన్ భగీరథ అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో వంగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయించారు.

ఈరోజు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో సోమవారం ధాన్యం కొనగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డైరెక్టర్లు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

సోయా కొనుగోళ్లు

కుభీర్: కుభీర్ మార్కెట్‌యార్డులో సోమవారం సోయా కొనుగోళ్లు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సోయాపంటను మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. వ్యాపారులు సైతం మార్కెట్‌కు వచ్చి కొనుగోళ్లు చేయాలని కోరారు.

చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ 124 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందిస్తారని తహసీల్దార్ మోతీరాం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


చైతన్య

తానూరు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని ఆదిత్య పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో తానూరు వాగ్దేవి పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ఆదివారం ప్రిన్సిపాల్ అరవింద్‌రెడ్డి తెలిపారు. హెచ్.ఆరుషి(అండర్-14, 22 కేజీల)విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పి.చైతన్య (అండర్-14, 56 కేజీల) విభాగంలో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాథోడ్ రమేశ్ ఆశయ సాధనకు కృషి


ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కడెంలో..

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో రాథోడ్ రమేశ్ 58వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, ఐదు వెంకటేశ్, పుప్పాల ఉపేందర్, దాసరి శ్రీనివాస్, రవి, గోపాల్ రెడ్డి, భూమన్న, అనిల్‌రావు, రంజిత్, కిషన్, సందీప్, రాజు, అశోక్ తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ అధ్వర్యంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ జయంతి నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్‌రాథోడ్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జక్కుల సత్తెన్న, వేణుగోపాల్, ముల్కి కృష్ణ, తిరుమల్, ప్రసాద్, బుర్రసాయికుమార్, మురళి, శ్రీరాం, నగేశ్, రంజిత్, దేవరాజ్, రాజేశ్, మోహన్‌నాయక్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారితో నారాయణరావు

భైంసాటౌన్/లోకేశ్వరం: లోకేశ్వరం మండలం కనకాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ సమక్షంలో రాజేందర్, ఆకాశ్, నగేశ్, దేవేందర్, సురేందర్, శ్రీకాంత్, వికాస్, రూకేశ్, దేవేందర్, రమేశ్, రాములు పార్టీలో చేరగా, ఆయన వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, ఓంప్రకాశ్ లడ్డా, లోకేశ్వరం మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ సేవాదల్ అధ్యక్షుడు సోమ సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుపై తప్పిన ముప్పు


వాగులోకి దూసుకెళ్లిన కారును రోడ్డుపైకి తీసుకొస్తున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ నుంచి ఖానాపూర్ మార్గంలోని రెంకోనివాగుపై వంతెన పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై కారు అదుపు తప్పింది. వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డుకు గోసంపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కరిపె రాజ్‌కుమార్ మొరం పోయించి రాకపోకలు పునరుద్ధరించారు. ఇటీవల వర్షం కారణంగా రోడ్డు స్వల్పంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఆదివారం ఒగులాపూర్‌కు చెందిన ఓ కారులో పలువురు పాత ఎల్లాపూర్‌వైపు వెళ్తుండగా వాగువైపు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అదుపు తప్పింది. కారును ట్రాక్టర్ సాయంతో రోడ్డుపైకి తేవడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

పైలం బిడ్డో.. పంట కుప్పలున్నయ్


నగర్ శివారులో రోడ్డుపై కంకులను నూర్పిడి చేస్తున్న రైతులు


ధర్మోర నుంచి లోకేశ్వరం వెళ్లే మార్గంలో..


లోకేశ్వరంలో రోడ్డుపైనే కంకుల కుప్పలు

లోకేశ్వరం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు స్థలం కరువై రోడ్లపై పోసి ఎండబెడుతున్నారు. దీంతో రోడ్లు కన్పించక వాహనదారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రాత్రివేళ, తెల్లవారుజామున వాహనదారులు పంట కుప్పలపైకి దూసుకెళ్తూ కిందపడుతున్నారు. కొన్నిచోట్ల పంట కుప్పల చుట్టూ బండరాళ్లు పెడుతున్నారని.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతుభరోసా ఇవ్వాలని నిరసన


ఖానాపూర్‌లోని జగన్నాథ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు


కుంటాలలో ధర్నాచేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కడెంలో బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని.. రైతుభరోసాను వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణరావు, రామునాయక్, రాజగంగన్న, వాల్‌సింగ్, రాజు, కలీల్, మురళి, రాజన్న, శేఖర్, గోపాల్, ఫహీం, ప్రణీత్ తదితరులు ఉన్నారు.

కడెం: ఎన్నికలవేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15 వేలు రైతుభరోసా అందించాలని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సతీశ్, స్వామి, రంజిత్, మల్లారెడ్డి తదితరులున్నారు.

కుంటాల: కల్లూరు-కుంటాల రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్సై భాస్కరచారి వెళ్లి నిరసన విరమించాలని నాయకులకు నచ్చజెప్పారు. రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, కుమ్మరి భాస్కర్, బొంతల పోశెట్టి, దాసరి కిషన్, సాయిరాజ్, వంశీ, శ్రీనివాస్, కల్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: అన్నదాతలకు రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాజనర్సయ్య, నాయకులు రాజునాయక్, గోపి, గంగన్న, అజయ్, రాములు, సాయి, తిరుపతి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై శంకర్

దస్తురాబాద్: వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్సై శంకర్ సూచించారు. ఆదివారం మండలంలోని గొడిసీర్యాల ఎక్స్‌రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ధర్మాజీ చందానే

భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తములుగా తీర్చిదిద్దాలని టీం భైంసా డివిజన్ కన్వీనర్ ధర్మాజీ చందనే అన్నారు. ఆదివారం పట్టణంలోని బుద్ధవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇటీవల ఉపాధ్యాయ కొలువు సాధించిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ జాడే, శంకర్ చంద్రే, శంకర్ గడపాలే, విఠల్ కాంబ్లే, దేవిదాస్, లక్ష్మణ్, రాజారాం, సూర్యదాస్ తదితరులున్నారు.

తబలాలో.. భళా

- కళాఉత్సవ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


తబలా వాయిస్తున్న శ్రీగాయత్రి

నిర్మల్‌ఖిల్లా: తబలా వాయిద్యం అనగానే.. సాధారణంగా పురుషులు నేర్చుకొని వాయిస్తారని అనుకుంటాం.. లేదా ఈ కళ వంశపారంపర్యంగా అబ్బుతుందని భావిస్తాం.. కానీ సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన పెసరి శ్రీగాయత్రి తబలా వాయిద్యంతో అందరిని మంత్రముగ్ధుల్ని చేస్తోంది. శనివారం నిర్మల్‌లోని జేపీఎన్ఆర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని తబలా వాయిద్యం(వ్యక్తిగత విభాగం)లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని డీఈవో రవీందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకుంది. ఈ అమ్మాయి ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్నప్పటి నుంచి తబలా వాయిద్యంపై ఉన్న ఆసక్తిని గమనించిన గాయత్రి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. దీంతో రోజు సాధన చేస్తూ తబలా వాయిద్యంపై పట్టు సాధిస్తూ రాణిస్తోంది.